క్లుప్తంగా

ఆందోళనలో రైతన్నలు..



నేరడి-బిలో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

భామిని: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ వర్షాలు పడి ధాన్యం పాడైపోతాయోనని తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో నూర్పులు చేపట్టి ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పారు. అలాగే మరి కొంతమంది ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో బిజీగా ఉన్నారు.

కిశోరి వికాసంలో అందరూ భాగస్వాములే..



సమావేశంలో మాట్లాడుతున్న బత్తిలి ఎస్సై అనిల్‌కుమార్

భామిని: కిశోరి బాలికల వికాసంలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్ రాణి, బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పేరిట కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోక్సో చట్టంపై ఎస్సై అనిల్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, ఎంఈఓ భాస్కరరావు, సీహెచ్ఓ సీహెచ్ భాస్కరరావు, ఐసీడీఎస్ సిబ్బంది.ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో గాయపడిన వీఆర్వో చంద్రమౌళి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిలో తిత్తిరి వీఆర్వో చంద్రమౌళి, మామిడిగూడకు చెందిన గణపతి ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.. జియ్యమ్మవలస మండలంలోని పీటీ మండ గ్రామానికి చెందిన వీఆర్వో చంద్రమౌళి కురుపాం మండలంలోని తిత్తిరి గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు. అదే గ్రామంలో ఉదయం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని, అర్జీల వివరాలు అప్‌లోడ్ చేసేందుకు తన కుమారుడితో కలిసి మొండెంఖల్లుకు వచ్చాడు. అక్కడి నుంచి తన స్వగ్రామమైన పీటీ మండకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఆయనకు ఎదురుగా కురుపాం మండలం, నీలకంఠాపురం పంచాయతీ, మామిడిగూడకు చెందిన గణపతి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, ఒకరినొకరు బలంగా ఢీకొన్నారు. దీంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు వీఆర్వో కుమారుడికి ఎటువంటి గాయాలవ్వలేదు. అప్రమత్తమైన స్థానికులు వైద్య సేవల నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.

వాహన తనిఖీలు

వీరఘట్టం: పట్టణంలోని బీఎంఆర్ సినిమా హాల్ జంక్షన్‌లో ఎస్సై కళాధర్ బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి అపరాధ రుసుం విధించారు. గతంలో ఫైన్ పడినా కట్టని వారిని గుర్తించి సమీపంలోని మీ సేవ కేంద్రంలో అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు తీసుకున్నారు.

పక్కాగా ఆరోగ్య కార్యక్రమాలు

పాలకొండ రూరల్: పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ రికార్డులు, కుక్క, పాము కాటుకు సంబంధించిన అత్యవసర మందుల నిల్వలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డులు, లేబర్ వార్డులు, ల్యాబ్ రూములు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్, డెమో యోగేశ్వరరెడ్డి ఈఓ రామారావు, వైద్య సిబ్బంది న్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

గరుగుబిల్లి: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని గృహ నిర్మాణ శాఖ ఏఈ అఖిల్‌నాయుడు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. పీఎంఏవై 2.0 పథకం ఇళ్లు కావాల్సిన వారు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బత్తిలి వద్ద దాల్వాయి వరి పొలం దమ్ము చేస్తున్న రైతు



యూరియా వాడకం తగ్గించాలి

- రబీ సాగుకు వ్యవసాయాధికారుల సూచనలు

భామిని:

ఖరీఫ్ సీజన్‌లో వరి చేను కోసిన పొలాల్లో రెండో పంటగా రబీలో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. నీటి వసతి గల పొలాల్లో దాల్వాయి వరిగా పిలిచే రెండవ పంటకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు, సోలార్ మోటార్లతో పొలాలకు నీరు పెట్టి దమ్ములు చేపడుతున్నారు. వరినారు పొలాలు తయారీలో తలమునకలయ్యారు. ఈ క్రమంలో రబీ వరిలో వచ్చే చీడపీడలు, కలుపు నివారణ చర్యలను వ్యవసాయాధికారులు సూచించారు.

యూరియా వాడకం తగ్గించాలి..

దమ్ముచేసే పంటపొలంలో ఎరువులు విధిగా వేయాలి. ఖర్చుతో కూడిన డీఏపీ, యూరియా వాడకం తగ్గించాలి. డీఏపీ వేస్తే యూరియా వాడకూడదు. అధికంగా డీఏపీ వాడకంతో భూమికి చౌడుతనం వస్తుంది. ఒక ఎకరం పొలం దమ్ములో రెండు బస్తాల సూపర్ పాస్ఫేట్, అరబస్తా పొటాష్, అర బస్తా యూరియా కలిపి వేయాలి. కాల్షియం, సల్ఫర్‌లు సూపర్ పాస్ఫేట్‌లో ఉంటుంది. సమ పాలలో వేయడంతో గింజ సైజు పెరిగి, గట్టితనం బరువు వస్తుంది.

రెండవ దఫా...

వరినాట్లు వేసిన 25 – 30 రోజుల్లో పిలకల దశలో రెండోసారి ఎరువులు వేయాలి. అరబస్తా యూరియా, 15కిలోల పొటాష్ కలిపి వేయాలి.

మూడవ దఫా...

వరి చేను వెన్నులు వేసి పాలుపోసుకొనే దశలో మూడవ సారి 25కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

కలుపు నివారణ చర్యలు

వరి నారు 30 రోజుల్లోపు నాటుకోవాలి. నాటిన మూడవ రోజు కలుపు నివారణకు మందులు వేయాలి. ఒక ఎకరానికి 35గ్రాముల ఆక్సాడైయాజిల్ మందును రెండు లీటర్ల నీరు మిశ్రమాన్ని 20 కిలోల ఇసుకతో కలిపి వరి చేలలో వెదజల్లాలి. వరిచేనులో గడ్డిజాతి, వెడల్పాకుల కలుపులను గుర్తించాలి. గడ్డిజాతి నివారణకు రేపఫ్‌గా పిలిచే కించర్ మందు పావు లీటరును 9ట్యాంకర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెడల్పు ఆకుల కలుపు ఉంటే 2-4-డి ఒక కిలో మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండు రకాల కలుపులుంటే 80గ్రాముల నామినీ గోల్డ్ మందును పది ట్యాంకుల నీటిలో కలిపి చల్లాలి. వరి చేనుకు 50 రోజులు దాటిన తరువాత కలుపు నివారణ మందులు వేయనక్కర్లేదు. ఈ చర్యలతో కలుపును నివారించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



కాట్రగడ-బి వద్ద రబీ సాగుకు సిద్ధం చేస్తున్న పొలం

చిన్నారులను పనిలో పెట్టరాదు..



అవగాహన కలిగిస్తున్న కార్మిక శాఖాధికారి

పాలకొండ: బాలలతో పని చేయించడం నేరమని.. అందుకు శిక్ష తప్పదని కార్మిక శాఖాధికారి కిరణ్ తెలిపారు. ఆపరేషన్ స్వచ్ఛ స్టేజ్ -4లో భాగంగా పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ ఎం.క్రాంతి, సామాజిక కార్యకర్త తోట ప్రవీణ్, తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి



పాలకొండ రూరల్: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21న పార్టీ నాయకులు, అభిమానులు విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తన ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన జగన్ మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాల కుటుంబాల్లో పెద్ద కొడుకు స్థానం దక్కించుకున్నారని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత జగనన్న పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటుకుందామన్నారు.

సిమెంట్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న గౌరీశంకరరావు, హైమావతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, మండ, గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనుల కోసం వినియోగించిన సిమెంట్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సర్పంచ్‌లు బి.గౌరీ శంకరరావు, ఎస్.హైమావతిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం విలేకరులతో మాట్లాడారు. సదరు మూడు పంచాయతీల్లో సచివాలయ నిర్మాణ పనులు 90 శాతం మేర పూర్తయ్యాయని, అయితే ఇప్పటివరకు సిమెంట్ బిల్లులు చెల్లింపు జరగకపోవడంతో సంబంధిత కాంట్రాక్టరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఇదివరకు డ్వామా పీడీ కె.రామచంద్రారావు దృష్టికి తీసుకువెళ్లామని, అయినప్పటికీ బిల్లుల చెల్లింపు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని, బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలో కలవరం...



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో బుధవారం వేకువజాము నుంచి మండల వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లని గాలులుతో పాటు అడపాదడపా చిరుజల్లులు కురవడంతో రైతుల్లో కలవరం నెలకుంది. పాలకొండ – వీరఘట్టం రహదారి, లుంబూరు, ఓని, మంగళాపురం, గరుగుబిల్లి, రుద్రిపేట, తదితర గ్రామాల రైతులు ఏఓ వాహిని సూచనల మేరకు యుద్ధప్రాతిపదికన తమ కళ్లాల్లో యంత్రాల సాయంతో నూర్పులు చేపడుతున్నారు. – పాలకొండ రూరల్

సందర్శన

సీతంపేట మండలంలోని సవర గొయిది గిరిజన ప్రాథమిక పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు బుధవారం సందర్శించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఒకటి, రెండు తరగతుల అక్షరమాలను తరగతి గదిలో ప్రదర్శించాలని సిబ్బందిని ఆదేశించారు. మూడు నుంచి ఐదు తరగతులకు చతుర్విధ ప్రక్రియలపై తర్ఫీదు ఇవ్వాలన్నారు. – సీతంపేట



వినూత్న నిరసన..



గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రిలే నిరాహార దీక్షల వద్దే విద్యార్థులకు పాఠాలు బోధించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని.. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.గణేష్, ఎస్.మోహనరావు, బి.ధర్మారావు, కె.భవానీ, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

రైతులు అప్రమత్తంగా ఉండాలి



గరుగుబిల్లి: వల్లరగుడబలో ధాన్యం భద్రపరుచుకునేందుకు శ్రమిస్తున్న రైతులు

భామిని: అల్పపీడన ద్రోణి ప్రభావంతో చెదురుముదురు వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం సూచించారు. మండల కేంద్రంతో పాటు లివిరి, బాలేరు, ఘనసర గ్రామాల్లో బుధవారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

గరుగుబిల్లి: తుపాను వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పొలాల్లో కోసిన వరి చేనును సురక్షిత ప్రాంతాలకు తరలించి, భద్రపరుచుకోవాలని చెబుతున్నారు. కళ్లాల్లో నూర్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సలహా ఇస్తున్నారు. ఇదిలా ఉంటే రైతులు ప్రభుత్వం కనీసం టార్పాలిన్లు కూడా సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా 'పెసా' ఎన్నికలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: పెసా (పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 41 పంచాయతీల్లో 102 గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యక్షులు, సెక్రటరీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణను ఎన్నికల సిబ్బందికి నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, తహసీల్దార్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

సీతంపేట: మండలంలోని నారాయణగూడకు చెందిన సవర లక్ష్మి అనే గర్భిణి బుధవారం 108లో ప్రసవించింది. లక్ష్మికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. దీంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. దీసరిగూడ వద్దకు వచ్చేసరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ రమేష్, ఆశావర్కర్, పైలట్ రామారావు ప్రసవం జరిపించా.. లక్ష్మి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.

గ్రామాభివృద్ధికి కచ్చితమైన ప్రణాళికలు అవసరం

- ఎంపీపీ శెట్టి శ్యామల



గురుగుబిల్లి: సూచనలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

కొమరాడ: దేశాభివృద్ధికి పల్లెలు పట్టుగొమ్మలని, గ్రామాల అభివృద్ధికి కచ్చితమైన ప్రణాళికలు అవసరమని ఎంపీపీ శెట్టి శ్యామల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగే ఈ తరగతులకు హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా చర్యలకు ఉపక్రమించాలన్నారు. శిక్షణ కో-ఆర్డినేటర్ భీమయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ప్రజల ఆర్థిక స్థితిగతులు గ్రామాభివృద్ధి పైనే ఆధారపడి ఉంటాయని తెలిపారు. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేసి, తక్కువ ధరకే వాటిని రైతులకు అందించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చవచ్చన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగి సీఐకి బ్రాంజ్ మెడల్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావును ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ కమెండేషన్ అవార్డు(బ్రాంజ్ మెడల్) వరించింది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి చేతులమీదుగా ఆయన ఈ అవార్డు బుధవారం అందుకున్నారు. కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్, శాంతిభద్రతల విభాగంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గాను ఈ అవార్డు వచ్చినట్లు తిరుపతిరావు తెలిపారు.

అక్రమ సస్పెన్షన్లు సరికాదు..

పాలకొండ రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు సహేతుకం కాదని ఆర్టీసీ జోనల్ కార్యదర్శి భానూరు కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఆయన సహచర ఉద్యోగులతో పాలకొండలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 1/2019 సర్క్యులర్ అమలు చేయకుండా కొంతమంది అధికారులు విజయనగరం జోన్ పరిధిలో 19 డిపోల్లో వ్యవహరిస్తున్న తీరుపై ప్రస్తావించారు. ఉద్యోగుల సమస్యలను వినతిరూపంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఈ క్రమంలో తమ సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు ఎర్ర బ్యాడ్జీలతో విధులు నిర్వహించాలని, మధ్యాహ్న భోజన విరామ సమయాల్లో గేటు మీటింగ్‌లు చేపట్టాలని సూచించారు.

పాలకొండలో వర్షం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. 23 నుంచి 14 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోవడంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జియ్యమ్మవలస: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్ కోరారు. మండలంలోని గెద్దతిరువాడ గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఆయన బుధవారం పరిశీలించి, కాసేపు మాట్లాడారు. ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీల్లో మార్పులు, చేర్పులు కావాల్సిన వారు సచివాలయాన్ని ఆశ్రయించి, ఆధార్ సేవలు పొందవచ్చని తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా బాగా చదువుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఎంటీసీ(మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు)ను ఆయన బుధవారం సందర్శించి, విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఎల్విన్‌పేట, చినమేరంగి సీఐలు బి.హరి, తిరుపతిరావు, ప్రిన్సిపాల్ యూగంధర్ పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి

వీరఘట్టం: అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అలాంటప్పుడే నష్టాన్ని తగ్గించగలమని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని హుస్సేన్‌పురం యూపీ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా.. జరిగితే ఎటువంటి నష్ట నివారణ చర్యలు చేపట్టాలో వివరించారు.

జాబ్‌మేళాతో ఉపాధి అవకాశాలు



మేళాకు హాజరైన యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: వివిధ కంపెనీలు నిర్వహిస్తున్న జాబ్‌మేళా కార్యక్రమాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. మెడ్‌ప్లస్, ఎయిర్‌టెల్ పేమెంట్, భారత్ పే కంపెనీలకు చెందిన నిర్వాహకులు 53 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈక్రమంలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీల సమన్వంతో ఈ తరహామేళాలు చేపడతామని వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి అన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పి.రాజ్యలక్ష్మి, ఎం.శాంతి, కె.శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, శ్రీనివాసరావు, వి.జనార్దనరావు, తిరుపతిరావు తదితరులున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం..



పేరుకుపోయిన చెత్తాచెదారం

పాలకొండ రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్త తరలించకపోవడంతో మూడు రోజులుగా కురుస్తున్న అడపాదడపా వర్షాలకు తీవ్ర దుర్గంధం వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు పేరుకుపోయిన చెత్తలో ఆహారం వెతుక్కునేందుకు వస్తున్న పశువులు, మూగజీవాలు అక్కడే మలమూత్రాలు వేస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా తయారైందని.. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే...

- ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఈ గోపాలకృష్ణ

వీరఘట్టం: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ వర్తించాలంటే నిబంధనలు పాటించాలని ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులతో మాట్లాడుతూ.. ప్రతి నెలా 199 యూనిట్ల విద్యుత్ వాడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రేషన్‌కార్డులో ఉన్నవారిలో ఎవరైనా ప్రభుత్వ లేదా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేసినా, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నా విద్యుత్ సబ్సిడీ వర్తించదన్నారు. అలాగే 1.82 ఎకరాల పల్లం భూమి కంటే ఎక్కువ భూమి ఉన్నా, 5 ఎకరాల కంటే ఎక్కువ మెట్టు భూమి ఉన్నా సబ్సిడీకి అనర్హులని చెప్పారు. చనిపోయిన వ్యక్తి పేరుమీద విద్యుత్ మీటర్ ఉంటే సబ్సిడీ వర్తించదని.. ఆ పేరును తొలగించి, కుటుంబ సభ్యుల పేరుమీద మార్చుకోవాలని సూచించారు. మండలంలో సుమారు ఐదు వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులుండగా.. వివిధ కారణాల వల్ల 1300 మందికి సబ్సిడీ వర్తించలేదని తెలిపారు. ఆయనతో పాటు ఏఈ అనిల్‌కుమార్, విద్యుత్ సిబ్బంది ఇప్పిలి తవుడు, మురళి ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com